సాక్షి
వికారాబాద్
బుధవారం । 22 । జనవరి । 2025



సాగు భూములకే ..

సాగుకు యోగ్యమైన భూములకే రైతు భరోసా పథకం వర్తిస్తుందని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. 8లో▸



ప్రజాసంక్షేమానికే..

ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 8లో▸



పేరుకే పోలీస్ స్టేషన్..!

దుద్యాల్ మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసినా ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. 9లో▸

సంక్షేమ సందడి

జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన గ్రామసభలు ప్రారంభం

- పాల్గొన్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు, ఎమ్మెల్యేలు
- అర్హుల జాబితా ప్రకటించిన అధికారులు
- పేర్లు లేనివారి నుంచి దరఖాస్తుల స్వీకరణ



వికారాబాద్ మండలం గొట్టిముక్ల గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్: ప్రజా పాలన గ్రామసభలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి అమలు చేయనున్న నాలుగు (రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు) పథకాలకు సంబంధించిన అర్హుల జాబితాను గ్రామ సభల్లో అధికారులు చదవి వినిపించారు. జాబితాలో పేర్లు లేని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో 585 గ్రామ పంచాయతీలు ఉండగా మొదటి రోజు 180 జీపీలు, 23 మున్సిపల్ వార్డుల్లో గ్రామసభలు పూర్తి చేశారు. సర్పంచులు, ఎంపీటీసీల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో సభలు నిర్వహించారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ వికారాబాద్ మండలం గొట్టిముక్ల గ్రామసభలో పాల్గొన్నారు. పూడూరు మండలం, పరిగి మండలంలోని గడిసింగాపూర్ తదితర గ్రామాల్లో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. పెద్దేముల్ మండలంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, నవాబుపేట మండల పులిమామిడిలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, కొడంగల్‌లో అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) లింగ్యా నాయక్, మోమిన్‌పేట మండలం మేకవనంపల్లి, ధారూరు మండలం దోర్నాల్ గ్రామంలో అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు) సుధీర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తాం: కలెక్టర్

'సంక్షేమ పథకాల అర్హుల జాబితాలో పేర్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు..అర్హులందరికీ లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ ధ్యేయం.. సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ' అని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం వికారాబాద్ మండలం గొట్టిముక్ల గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ముందుగా నాలుగు సంక్షేమ పథకాల కోసం గ్రామం నుంచి ఎంపిక చేసిన అర్హుల జాబితాను చదివి వినిపించారు. అనంతరం జాబితాలో పేర్లు లేనివారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 26 నుంచి అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హులను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించామని తెలిపారు. సాగుకు యోగ్యమైన భూములను గుర్తించామన్నారు. ఆత్మీయ భరోసా పేరిట ఎకరాకు రూ.12 వేల చొప్పున ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. ఈ డబ్బులు రెండు విడతల్లో జమ అవుతాయన్నారు. సాగు భూమి లేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరిట ఏడాదికి రూ.12 వేలు చొప్పున వారి ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు ఉపాధి కూలీలకు వెళ్లిన వారిని ఈ పథకం కింద గుర్తించామని వెల్లడించారు. అనంతరం అర్హుల జాబితాను గ్రామ సభలో ఆమోదం తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోరాదని అన్నారు. మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాల్లోనూ దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం

తాండూరు టౌన్: తాండూరు డిపో పరిధిలోని ఆర్టీసీ బస్సు సౌకర్యాలు, సమస్యలపై నేడు (బుధవారం) డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తాండూరు డిపో మేనేజర్ సురేష్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2నుంచి 3గంటల వరకు సెల్ నంబర్ 9959226251కు డయల్ చేసి మీరు ఎదుర్కొంటున్న బస్సు ప్రయాణ సమస్యలు, సలహాలు, సూచలను తెలియజేయాలన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి

అదనపు కలెక్టర్ ఉమాహారతి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఉమాహారతి

మోమిన్‌పేట: విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ ఉమాహారతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వారంలో రెండు రోజులు విద్యార్థులకు ఆంగ్ల పదాలు నేర్పించాలన్నారు. మాట్లాడేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. అలాగే కమ్యూనికేషన్ స్కిల్స్‌లో పట్టు సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశం, ప్రధానోపాధ్యాయులు గౌరి శంకర్, సమ్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

ఏఓ పూజ



కొడంగల్ రూరల్: జనవరి ఒకటవ తేదీ 2025 నాటికి కొత్తగా పాస్ పుస్తకాలు వచ్చిన వారు, ఒక్కసారి కూడా రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోని అన్నదాతలు పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ బీ పూజ సూచించారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. భూమి పాస్ బుక్ జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్(సేవింగ్ ఖాతా)లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో పథకం పొందిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ



ఎస్‌ఐ రమేష్

తాండూరు టౌన్: తాండూరు టౌన్ నూతన ఎస్‌ఐగా వన్నెగూడ రమేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన బషీరాబాద్ మండల ఎస్‌ఐగా విధులు నిర్వర్తించారు. గతేడాది సెలవుపై వెళ్లారు. ప్రస్తుతం ఆయనను తాండూరు టౌన్ ఎస్‌ఐగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

విద్యార్థుల సామర్థ్యం మెరుగుపడాల్సిందే

స్టేట్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ ఐ.వి.సుబ్బారావు



బొంరాస్‌పేట: తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడాల్సిందేనని స్టేట్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ ఐ.వి.సుబ్బారావు సూచించారు. మంగళవారం బొంరాస్‌పేట స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరై ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యాలు ఎలా ఉన్నాయో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ హరిలాల్, సీఆర్‌పీలు జీవన్‌కుమార్, నవీన్‌కుమార్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రసాభాసగా వార్డు సభ

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌లో మంగళవారం నిర్వహించిన వార్డు సభ రసాభాసగా మారింది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు ఒకరినొకరు విమర్శించుకున్నారు. లబ్ధిదారుల ఎంపిక జాబితా మొత్తం ఏకపక్షంగా ఉందని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. అర్హులకు కాకుండా అనర్హులకే పథకాలు ఎక్కువగా అందేలా ఉన్నాయని మండిపడ్డారు.

రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం

ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేద్దామని ఎస్పీ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా వికారాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో కొండా బాల కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలను పరిష్కరించేకు చర్యలు చేపడతామన్నారు. ఇందుకు జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు. జిల్లాలో ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాల (బ్లాక్ స్పాట్స్)ను గుర్తించి అక్కడ సంబంధిత శాఖలతో సమన్వయం పాటిస్తూ నివారణ చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, పట్టణ ప్రజలు పోలీసుల సూచనలు పాటించాలన్నారు. అనంతరం జాతీయ రోడ్డు భద్రత ఉత్సవాల సంబంధించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీటీఓ వెంకట్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంవీఐ జోసెఫ్, సీఐ భీమ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి, పోలీస్ అధికారులు

కూచిపూడిలో ధన్వశ్రీ ప్రతిభ



తాండూరు టౌన్: తాండూరు పట్టణానికి చెందిన సరితాగోపాల్ దంపతుల కుమార్తె ధన్వశ్రీ కూచిపూడిలో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. శ్రీశైల దేవస్థాన ధర్మపథం ప్రాంగణంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనల్లో ధన్వశ్రీ అద్భుత ప్రదర్శన ఇచ్చింది. ధన్వశ్రీకి నిర్వాహకులు ప్రశంసా పత్రం అందజేశారు. పట్టణంలోని శ్రీ నేతాజీ గురుదేవ్ గురుకుల్‌లో ఒకటవ తరగతి చదువుతున్న ధన్వశ్రీ, నృత్య గురువు మంజుల వద్ద కూచిపూడి నృత్యం నేర్చుకుంటోంది.

కానిస్టేబుల్‌పై చేయి చేసుకున్న ఇద్దరిపై కేసు

ధారూరు: ప్రజాపాలన గ్రామసభలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌పై చేయి చేసుకొని, నెట్టేసిన ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ధారూరు ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ కథనం మేరకు.. మండలంలోని మైలారం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో కానిస్టేబుల్ రాందాస్ విధులు నిర్వర్తిస్తున్నారు. అక్కడికి వచ్చిన మైలారం ముందలి తండాకు చెందిన ఆంగోత్ బద్యనాయక్, రమావత్ శ్రీనివాస్ మద్యం మత్తులో సమావేశానికి అడ్డుతగిలారు. వీరిని కానిస్టేబుల్ రాందాస్ అదుపు చేయబోయారు. రెచ్చిపోయిన బద్యానాయక్ కానిస్టేబుల్‌పై చేయిచేసుకోగా, శ్రీనివాస్ అతన్ని నెట్టేసాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి అన్ని శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో వేడుకలు నిర్వహించనున్నందున అందుకు అనుగుణంగా వేదిక, అతిథులు, ప్రముఖులు, నాయకులు కూర్చునేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రొటోకాల్‌ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని తెలిపారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. వేడుకలు నిర్వహించే ప్రాంతంలో వైద్య బృందం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

363 పోస్టులు మంజూరు



కొడంగల్‌లోని నర్సింగ్ కళాశాల

కొడంగల్: మండలంలోని అప్పాయిపల్లి గ్రామ శివారులో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా 363 వివిధ రకాల పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. మంగళవారం ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా జీఓ నంబర్ 3 విడుదల చేశారు. నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలకు 117 పోస్టులు, కొడంగల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి 199 పోస్టులు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు 31 పోస్టులు, ప్రభుత్వ ఫిజియోథెరపీ కళాశాలకు 16 పోస్టులను భర్తీ చేసుకునేందుకు పరిపాలనా అనుమతులు ఇచ్చారు. మెడికల్ కళాశాలకు ప్రిన్సిపాల్‌తో పాటు ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్, జనరల్ ఆసుపత్రి కోసం మెడికల్ సూపరింటెండెంట్ ఆర్ఎంఓతో పాటు వైద్యులు, మెడికల్ ఆఫీసర్స్, నర్సింగ్ స్టాఫ్, ఫార్మాసిస్టులు, రికార్డు అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్‌లతో పలు రకాల విభాగాలకు పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు త్వరలో ఉద్యోగ నియామకాలు చేపట్టే అవకాశం ఉంది.

లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ



మేకవనంపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్‌కుమార్

అదనపు కలెక్టర్ సుధీర్‌కుమార్

మోమిన్‌పేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల ఎంపిక నిరంతరంగా కొనసాగుతుందని అదనపు కలెక్టర్ సుధీర్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని మేకవనంపల్లిలో నిర్వహించిన గ్రామ సభకు ఆయన హాజరై మాట్లాడారు. రేషన్ కార్డుల పంపిణీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపిక నిరంతరంగా కొనసాగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు అందుతాయన్నారు. ప్రజాపాలనలో చేసుకోనివారు గ్రామ సభల్లో అర్జీలు ఇవ్వచ్చని తెలిపారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేలు, భూమి లేని నిరుపేద కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సంవత్సరానికి రూ.12 వేలు వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు వివరించారు. ప్రతి పథకంలో అర్హులకు చోటు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి సదానందం, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, డిప్యూటీ తహసీల్దార్ సురేష్, ఆర్ఐ గోవర్ధన్, కార్యదర్శి సుగుణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ఆరా



వికారాబాద్ ప్రభుత్వాస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న అనురాధ మెడోస్

అనంతగిరి: జిల్లాలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై భారత ప్రభుత్వ కుటుంబ సంక్షేమ శాఖ తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ విభాగం సీనియర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ మెడోస్ ఆరా తీశారు. వీరు 3 రోజుల పాటు జిల్లాలోని ఆయా పథకాల అమలును పర్యవేక్షించనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం డీఎంహెచ్‌ఓ వెంకటవరణ, ఇతర పీఓలతో జిల్లాలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన జాతీయ కీటక జనత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం, మాతాశిశు సంరక్షణ సేవలు, కుటుంబ నియంత్రణ, జాతీయ కుష్టు నివారణ కార్యక్రమం అమలు.. అందుకు సంబంధించిన నిధుల విడుదల, ఖర్చులు.. వివిధ సంక్షేమ కార్యక్రమాల అమలు.. వాటి ఫలితాల గురించి సమీక్షించారు. అనంతరం వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి అక్కడ అమలవుతున్న తీరును పరిశీలించారు. మరో రెండు రోజుల పాటు జిల్లా లో పర్యటించి ప్రభుత్వ వైద్య కళాశాల, జిల్లా ఆస్పత్రి, ప్రాంతీయ ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లను తనిఖీ చేయనున్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ జీవరాజ్, రవీంద్ర, పీఓలు పవిత్ర, బుచ్చిబాబు, ప్రవీణ్ పాల్గొన్నారు.

దశలవారీగా పథకాల అమలు

ఇబ్రహీంపట్నం రూరల్: అర్హులందరికీ దశలవారీగా సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి అధ్యక్షతన ప్రజాపాలన వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండేది రేవంత్‌రెడ్డి సర్కార్ అని చెప్పారు. అర్హులకు పథకాలు అందకపోతే అధికారులదే బాధ్యత అని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఆదిబట్ల మున్సిపల్ కౌన్సిలర్ లావణ్య, కమిషనర్ బాలకృష్ణ, కోఆప్షన్ సభ్యులు గోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే యాదయ్య తదితరులు



ఊరడమ్మ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉత్సవం.. వైభవం

నవాబుపేట మండలం చించల్‌పేటలో వెలసిన గ్రామ దేవత ఊరడమ్మ ఉత్సవాలు రెండో రోజు మంగళవారం ఘనంగా జరిగాయి. అమ్మవారికి నైవేద్యం, శాంతి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు వందల సంఖ్యలో తరలిరావడంతో గ్రామం జనసంద్రంగా మారింది. వేడుకల్లో ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

- నవాబుపేట

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

తాండూరు రూరల్: నాలుగు పథకాల అమలుకు ప్రభుత్వం గ్రామాలు, వార్డుల వారీగా మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తోంది. ఈ మేరకు బుధవారం నిర్వహించే గ్రామ సభలకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరవుతారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖాంజాపూర్, కరన్‌కోట్, ఉద్దండాపూర్, గుండ్లమడుగు తండాలో గ్రామసభల్లో పాల్గొంటారని చెప్పారు.

దరఖాస్తుకు చివరి తేదీ లేదు

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



మాట్లాడుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని.. దరఖాస్తులకు చివరి తేదీ లేదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆర్కతల, మమ్మదాంపల్లి, నాగిరెడ్డి పల్లి, కేశవపల్లి, పులుమామిడి, లింగంపల్లి, మాదారం గ్రామాల్లో మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. ఇందిరమ్మ ఇల్లు రేషన్ కార్డులు, రైతు భరోసా తదితర పథకాలకు గాను 589 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ అనురాధ తెలిపారు. పులుమామిడి, లింగంపల్లి గ్రామసభల్లో ఎమ్మెల్యే యాదయ్య పాల్గొని మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. ప్రజాపాలన, గ్రామసభలే కాకుండా దరఖాస్తుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందన్నారు.

జిల్లా స్థాయి ఒలింపియాడ్‌కు విశ్యాల విద్యార్థులు



జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం రవి

షాద్‌నగర్: మండల పరిధిలోని విశ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం శివరాంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో మండల స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విశ్యాల జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన శ్వేత, బ్యాగరి సంధ్య, ఎండీ నయీం, కార్తీక్ జిల్లా స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం రవి తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

అబ్దుల్లాపూర్‌మెట్: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. తారామతిపేట గ్రామానికి చెందిన చేగూరి బాలయ్య(56) కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి 7.30గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలయ్య తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెతుకుతుండగా గ్రామ శివారులోని ఓ చెట్టుకు తాడుతో ఉరివేసుకుని కనిపించాడు. మృతుడి కుమారుడు శివ ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చింతుల్లలో ఉద్రిక్తత

అనుమానంతో మృతదేహానికి పోస్టుమార్టం

యాచారం: మండల పరిధిలోని చింతుల్ల గ్రామంలో మంగళవారం ఉద్రిక్తత పరిస్థితి చోటుచేసుకుంది. యాచారం సీఐ నర్సింహరావు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కాసోజు రమాచారి(40) మోటార్ మెకానిక్‌గా పనిచేస్తూ నగరంలో స్థిరపడ్డాడు. అనారోగ్యం కారణంగా ఆయన సోమవారం మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు రమాచారి మృతదేహన్ని స్వగ్రామం చింతుల్లకు తీసుకువచ్చారు. మృతదేహంపై గాయాలు ఉండడం గమనించిన గ్రామస్తులు దాడి చేసి చంపారనే అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో క్లూస్ టీం పోలీసులు మృత దేహన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. మృతుడికి భార్య ఉమారాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాసంక్షేమానికే ప్రాధాన్యం

ప్రతీ ఏడాది 3,500 ఇళ్లు

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పరిగి: గడిసింగాపూర్‌లో గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం ప్రజా సంక్షేమానికి పాటుపడుతుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గడిసింగాపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభకు హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవం నుంచి అర్హులకు సంక్షేమ పథకాలు ప్రారంభమవుతాయన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే 3,500 ఇళ్లు మంజూరయ్యాయని మరో రెండు, మూడు నెలల్లో మరో 3,500 ఇళ్లు మంజూరవుతాయని చెప్పారు. రైతు భరోసా పథకంలో నియోజకవర్గానికి రూ.90కోట్లు అందనున్నాయన్నారు. జాబితాలో పేరు లేని అర్హులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ ఆయూబ్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో 42వేల ఇళ్లు ఇచ్చాం

పూడూరు: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పేదలకు చేసిందేమీ లేదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని నిర్వహించిన గ్రామసభకు హాజరై మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో నియోజకవర్గంలో 42 వేల మందికి ఇళ్లు ఇచ్చామని గుర్తు చేశారు. ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిగి ప్రాంతాభివృద్ధి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని చెప్పారు. పూడూరు మండంలో రూ.3వేల కోట్లతో నేవీరాడార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారనన్నారు. నియోజక వర్గంలో రూ.340 కోట్లతో పరిగి–వికారాబాద్, పరిగి–షాద్ నగర్ డబుల్ రోడ్లుగా మార్చేందుకు టెండర్లు పిలిచామని వివరించారు. అనంతరం రూ.3.20 కోట్లతో కేజీబీవీలో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, డీపీఓ జయసుధ, తహసీల్దార్ భరత్‌గౌడ్, ఎంపీడీఓ పాండు, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, మాజీ చైర్మన్లు రఘునాథ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పెంటయ్య, శకీల్, అజీంపటేల్, నర్సింహారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన అనవసరం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: సంక్షేమ పథకాలు అందని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. వారి నుంచి నిరంతరం దరఖాస్తుల స్వీకరిస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండల కేంద్రంతో పాటు గాజీపూర్, గోపాల్‌పూర్, నాగులపల్లి గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చినా అధికార కాంగ్రెస్ సంక్షేమ పథకాలు అందజేయడంలో ఎక్కడ వెనుకడుగు వేయడం లేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సైతం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, మైనింగ్ ఏడీ సత్యనారాయణ, డీఎల్‌పీఓ శంకర్‌నాయక్, తహసీల్దార్ వెంకట్ ప్రసాద్, ఎంపీడీఓ జర్నప్ప, సీడీపీఓ శ్రీలక్ష్మీ, మాజీ కో ఆప్షన్ సభ్యులు నసీరుద్దీన్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, చిత్రంలో సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

26 నుంచి పథకాల అమలు

భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన సంక్షేమ పథకాలు ఈ నెల 26 నుంచి అమలు అవుతాయని తాండూరు డివిజన్ సబ్-కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ అన్నారు. గాజీపూర్‌లో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ఇప్పటికే లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు.

గ్రామ సభల్లో దరఖాస్తుల స్వీకరణ

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట: ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ సభల్లో సంక్షేమ పథకాల అర్హుల జాబితా ప్రకటిండచంతో పాటుగా అర్హులయి ఉండి జాబితాలో పేరు లేని వారు దరఖాస్తు చేసుకోవచ్చునని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం చౌదర్‌పల్లి, నాగిరెడ్డిపల్లి, మదన్‌పల్లి, కుబ్యానాయక్‌తండాలో నిర్వహించిన గ్రామ సభల్లో మాట్లాడారు. పాత రేషన్ కార్డులు యథాతథంగా కొనసాగుతాయని.. కొత్త రేషన్ కార్డుల ప్రాథమిక ప్రక్రియ, దరఖాస్తుల స్వీకరణకు ఈ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల పరిధిలో మొదటి రోజు నిర్వహించిన సభలో రైతు భరోసాకు 20, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 38, రేషన్‌కార్డులకు 456, ఇందిరమ్మ ఇళ్లకు 54 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు ఇరిగేషన్ డీఈ కిరణ్‌కుమార్, ఏడీఏ శంకర్‌రాథోడ్, ఎంపీడీఓ వెంకన్నగౌడ్, ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



చౌదర్‌పల్లి గ్రామసభలో మాట్లాడుతున్న రాజేశ్‌రెడ్డి

అభ్యంతరాలుంటే చెప్పండి

అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: వార్డు సభలో ప్రదర్శిస్తున్న జాబితాలు పరిశీలించి అభ్యంతరాలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. మంగళవారం ఆయన వికారాబాద్ మున్సిపల్ పరిధి ఎన్నెపల్లి 32వ వార్డులో ఏర్పాటు చేసిన వార్డు సభలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే రైతు భరోసా, ఇందరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు అర్హులై ఉండి జాబితాలో లేకుండా సభల్లోనే దరఖాస్తు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ వార్డు సభలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, వార్డు ప్రజలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కార్యదర్శుల వద్ద దరఖాస్తు ఫారంలు

ధారూరు: గత సంవత్సరం నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభల్లో ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకుని లబ్ధిచేకూరని వారుంటే ప్రస్తుత ప్రజా పాలన గ్రామ సభల్లో తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. మండల పరిధిలోని దోర్నాల్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో ఆయన పాల్గొని ప్రజలతో మాట్లాడుతారు. సమస్యలు వస్తుంటాయి.. పరిష్కారం అవుతుంటాయి.. అధికారుల దృష్టికి తీసుకరావడమే మీ బాధ్యత అని చెప్పారు. అర్హత కలిగిన వారందరి జాబితా గ్రామ సభల్లోనే ఆమోదిస్తారని చెప్పారు. దివ్యాంగులు, ఒంటరి మహిళ, వ్యవసాయ కూలీలాంటి వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. ఆయా గ్రామ కార్యదర్శుల వద్ద దరఖాస్తు ఫారాలు ఉన్నాయని, దరఖాస్తు ఫారం లేని వారు తెల్ల కాగితం పైన అన్ని వివరాలతో దరఖాస్తు ఇవ్వవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నర్సింహులు, ఏడీఏ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



ధారూరు: దోర్నాల్ గ్రామ సభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

నా పేరు ఎందుకు లేదు?

అధికారులను నిలదీసిన గిరిజన మహిళ

ధారూరు మండల పరిధిలో 15 రెవెన్యూ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభల్లో ప్రజలు తీరు భిన్నంగా కనిపించింది. అధికారులు వచ్చిన వెంటనే ఆవేశంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదంటూ నిలదీశారు. దీంతో అధికారులు ప్రభుత్వ ఉద్దేశం వివరిస్తూ ఎవరికి ఏ పథకం వర్తించకున్నా తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని, అర్హులైన ప్రతీ ఒక్కరికి మంజూరు అవుతాయని చెప్పడంతో శాంతించి దరఖాస్తు చేసుకున్నారు. దోర్నాల్‌లో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ పాల్గొన్న గ్రామ సభలో చంద్రిబాయి అనే మహిళ ఇందిరమ్మ ఇల్లు మంజూరులో నా పేరెందుకు లేదని నిలదీసింది. వివాహమై దోర్నాల్‌తండాకు వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఇల్లు మంజూరు కాలేదని, నాయకులు, పదవి ఉన్నోళ్లు చెప్పిన వారికే ఇస్తే ఎలా అంటూ ప్రశ్నించింది. రాసిఇస్తే తీసుకుని వెళతారు, అసలు ఇల్లు వస్తుందా అని నిలదీసింది. అక్కడున్న వారు ఆమెకు సర్దిచెప్పడంతో ఇందిరమ్మ ఇల్లుకు దరఖాస్తు సమర్పించింది.

రూ.18వేల కనీస వేతనం ఇవ్వాలి



పాదయాత్రగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్తున్న ఆశవర్కర్లు

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ

అనంతగిరి: ఆశవర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆశవర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. ఆశ వర్కర్లకు ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని.. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. నిరవధిక సమ్మె సమయంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్న వైద్య శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరానికి చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు మంగమ్మ, అమృత, ఉమాదేవి, లలిత, అరుణ, యాదమ్మ, సునీత, సుజాత, అంజమ్మ, అపురూప, శ్రీదేవి, సరిత, అంజమ్మ, సులోచన పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



బాలిక కుటుంబీకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న చైల్డ్‌లైన్, ఐసీడీఎస్ సిబ్బంది

ఇరువర్గాల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

- బాలికను సఖి సెంటర్‌కు తరలింపు

ధారూరు: ఓ బాలికలకు ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని 1098కు మంగళవారం సమాచారం ఇచ్చింది. విషయం తెలుసుకున్న చైల్డ్‌లైన్, ఐసీడీఎస్, పోలీసు శాఖల సిబ్బంది వెంటనే వివాహాన్ని అడ్డుకున్నారు. ఈ ఘటన మండల పరిధిలోని ధర్మాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికకు అదే గ్రామానికి చెందిన యువకుడితో వివాహం చేసేందుకు తల్లిదండ్రులు నిశ్చయించారు. బాలిక వికారాబాద్ సమీప కొత్తగడి రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తనకు పెళ్లి ఇష్టం లేదని చెప్పినా తల్లిదండ్రులు పట్టించుకోలేదు. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చిన కూతురు వివాహం చేసేందుకు నిర్ణయించి కళాశాలకు పంపలేదు. ఎందుకు పంపించడం లేదని కళాశాల నుంచి ఫోన్ చేయడంతో అసలు విషయం బయటకు వచ్చింది. దీంతో చైల్డ్‌లైన్, ఐసీడీఎస్, పోలీస్ శాఖల సిబ్బంది గ్రామానికి చెందిన ఇరువర్గాల తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి పెళ్లి వాయిదా వేయించారు. 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని ఆదేశించారు. బాలికను వికారాబాద్ సఖి సెంటర్‌కు తరలించారు.

ఆటో అదుపుతప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

షాబాద్: ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరికి తీవ్రగాయాలవ్వగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన షాబాద్ ఠాణా పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన ప్రకారం.. సర్దార్‌నగర్ నుంచి ఓ ఆటో ఆరుగురు ప్రయాణికులతో షాబాద్‌కు ప్రయాణిస్తోంది. షాబాద్ సమీపంలో ఈట్ అండ్ ప్లే సమీపంలోకి రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కుమ్మరిగూడకు చెందిన కుమ్మరి ఎల్లయ్య, కొమరబండకు చెందిన గందం రాములుకు తీవ్రంగా గాయపడగా.. ఎల్లయ్య భార్య పద్మమ్మ, చర్లగూడకు చెందిన మల్కాపురం సాయిలమ్మ అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ దామపల్లి రాములు, ముద్దెంగూడకు చెందిన రాములుకు స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



ఘటనాస్థలిలో గుమికూడిన జనం

భార్యను హతమార్చిన భర్తకు జీవిత ఖైదు

శంకర్‌పల్లి: అనుమానంతో భార్యను హతమార్చిన భర్తకు రంగారెడ్డి జిల్లా కోర్టు జీవితఖైదుతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. మోకిల సీఐ వీరబాబు తెలిపిన ప్రకారం.. శంకర్‌పల్లి మండలం మిర్జాగూడ అనుబంధ గ్రామం ఇంద్రారెడ్డినగర్‌లో మాణిక్యం(48), యాదమ్మ(45) దంపతులు నివసిస్తుండేవారు. మాణిక్యం నిత్యం తాగి వచ్చి భార్యకు వివాహేతర సంబంధం ఉందని గొడవపడేవాడు. ఈ క్రమంలో 2024 మే 5న నిద్రిస్తున్న యాదమ్మ తలపై బండరాయితో మోది కిరాతంగా హత్యచేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు వివరాలు జిల్లా పీడీజే కోర్టు న్యాయమూర్తి ఎస్.శశిధర్‌రెడ్డికి సమర్పించగా ఆయన నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.500 జరిమానా విధించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అబ్దుల్లాపూర్‌మెట్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. తారమతిపేట రెవెన్యూ పరిధిలోని నద్దుపల్లి ఇటుక కంపెనీ వెనుక గుంతలో ఓ వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు మంగళవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 సంవత్సరాల వరకు ఉండొచ్చని, మృతుడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. మృతుడి ఒంటిపై ఫుల్ హ్యాండ్స్ టీషర్ట్, డ్రాయర్ మాత్రమే ఉందని.. శవం పూర్తిగా కుళ్లిపోయి దుర్వాసన వస్తూ గుర్తు పట్టలేని స్థితిలో ఉందన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

షాద్‌నగర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ బలరాం తెలిపిన ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం రాయకుంట తండాకు చెందిన గణేశ్(19), సురేశ్ ఈ నెల 19న బైక్‌పై మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో పీర్లగూడ సమీపానికి రాగానే వారి వాహనాన్ని వెనక నుంచి వస్తున్న మరో బైక్ వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గణేశ్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి బంధువు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాగు భూములకే రైతు భరోసా



కొడంగల్ : మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



కొడంగల్ రూరల్: పోశమ్మతండాలో పేరు లేదని అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్: సాగు భూములకే రైతు భరోసా వర్తిస్తుందని అదనపు కలెక్టర్, ప్రత్యేకాధికారి లింగ్యానాయక్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల ముసాయిదా జాబితా ఆమోదంపై చర్చించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి లేని రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ప్రభుత్వం రూ.12వేలు ఆర్థిక సాయం చేస్తుందన్నారు. కొత్త రేషన్‌కార్డులకు, రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్లాట్లుగా మారిన భూములకు, లే అవుట్లకు, వ్యవసాయానికి యోగ్యంగా లేని భూములకు, నాలా అనుమతి తీసుకున్న భూములకు రైతు భరోసా రాదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, కమిషనర్ బలరాం నాయక్, తహసీల్దార్ విజయ్‌కుమార్ ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మున్సిపల్ పరిధిలోని 1, 2, 3, 8 వార్డుల్లో ప్రజా పాలన సభ నిర్వహించారు. ఆయా వార్డుల్లో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఇవ్వండి

కొడంగల్ రూరల్: అర్హత ఉండి జాబితాలో పేరు లేని వారు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని అప్పాయిపల్లి, అన్నారం, పోశమ్మతాండా, చిన్ననందిగామ, పల్లురాళ్లతండా, బోయపల్లితండా, హస్నాబాద్, సంఘాయిపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సంక్షేమ పథకాలకు సంబంధించి ఎంపిక చేసిన లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించారు. ఈ క్రమంలో పోశమ్మతాండాలో పలువురు తమకు సంక్షేమ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన అధికారులు పేరులేని వారు ఆందోళన చెందకుండా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, డిప్యూటీ తహసీల్దార్ అనిత, ఆయా గ్రామాల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీ రోడ్డుకు భూములివ్వం



నినాదాలు చేస్తున్న రైతులు

కందుకూరు: ఫ్యూచర్ సిటీకి తమ భూములు ఇచ్చేది లేదని రైతులు తేల్చి చెప్పారు. మండల పరిధిలోని లేమూరులో మంగళవారం ఫ్యూచర్ సిటీ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భూసేకరణ విషయమై రైతులతో చర్చించారు. తమ భూములు ఇవ్వడానికి అంగీకరించేదిలేదని వారు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న శ్రీశైలం రహదారినే విస్తరిస్తే తమ భూములు కోల్పోవాల్సిన అవసరం ఉండదన్నారు. తప్పనిసరైతే భూమికి భూమి లేదంటే బహిరంగ మార్కెట్ ధర ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు. దీంతో మీరు ఏ విషయం తేల్చనప్పుడు ఎందుకు సమావేశం పెట్టారని, కలెక్టర్‌తోటే సమావేశాన్ని ఏర్పాటు చేయొచ్చు కదా అని రైతులు నిలదీశారు. సమావేశానికి హాజరైనట్లు సంతకాలు చేయకుండానే రైతులు తమ అభిప్రాయాన్ని చెప్పి మధ్యలోనే వెళ్లిపోయారు. అనంతరం బయటికి వచ్చి న్యాయం కావాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు, స్థానిక కాంగ్రెస్ నాయకుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్ఐ యాదగిరి, రైతులు పాల్గొన్నారు.